# వెర్రి వాణి

వాణి తన భర్తతో కలసి అబిడ్స్‌లో నడచి వెడుతూంటే తన చిన్ననాటి మాస్టారు అచ్యుతంగారు కనిపించారు. అమాంతంగా ఆయన పాదాలకి నమస్కరించింది. అంత బిజీగా ఉన్న అబిడ్స్‌లో అలా నమస్కారం పెట్టడం చాలా అరుదు. అందుకనే ఒక ఇరవైమందికి తక్కువ కాకుండా అలాగే ఆగిపోయి ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు.



"లే అమ్మా! ఏమిటిది!" అన్నారు అచ్యుతంగారు.

"నేను మాస్టారూ! మీ శిష్యురాల్ని. హైస్కూల్లో మీ దగ్గర చదువుకున్నాను. జ్ఞాపకం లేదా!" అంది వాణి.

వాణి భర్త ఇదంతా చూస్తూ, "నేనంటే అసలు పతిభక్తి లేదు దీనికి. కొత్త చీర ఎంత ఖరీదైనది కొన్నా నా కాళ్లకి దండం పెట్టదు. అటువంటిది ఎప్పుడో చిన్నప్పటి మాస్టారికి, ఇంత బిజీగా ఉన్న అబిడ్స్‌లో పాదనమస్కారం చేస్తోంది. పైగా జ్ఞాపకం లేదా అని అడుగుతోంది. బాగా చదివే వాళ్లనే మాస్టర్లు గుర్తుపెట్టుకుంటారు. ఇటువంటి జీళ్ల ఏబ్రాసిని ఎవరు గుర్తుపెట్టుకుంటారు!" అనుకున్నాడు.

"ఆ నువ్వటమ్మా! ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. ఆ ఏం చదువుకున్నావు!"

"బి.ఏ. చదువుతూంటే పెళ్లయిపోయింది మాస్టారు. రెండు పార్టులు అలాగే ఉండిపోయాయి!" అంటూ "ఈయన నా భర్త ఆనంద్" అని తన భర్తని పరిచయం చేసింది.

"ఏం అమ్మా! ఎంత మంది పిల్లలు" అన్నారు మాస్టారు.

"పిల్లలు లేరు మాస్టారూ!"

"అయ్యో! అటు చదువూ పూర్తి కాలేదు! ఇటు పిల్లలూ లేరు!" అంటూ "ఏం చేస్తున్నావయ్యా నువ్వు!" అన్నారు ఆనంద్‌కేసి తిరిగి.

"స్టేట్ గవర్నమెంట్‌లో పనిచేస్తున్నానండి" అన్నాడు ఆనంద్.

మాస్టారు మనసులోనే విసుక్కున్నారు. ఏమిటో సమాధానం తెలియకపోతే పోవచ్చు! వెధవది! చాలామందికి ముందు ప్రశ్నే అర్థం కాదు!

"ఏమిటి మాస్టారూ మీరు హైదరాబాద్‌లోనే ఉంటున్నారా!" అంది వాణి.

"లేదమ్మా! సొంత ఊళ్లోనే ఉంటున్నాను. చాలా సంతోషమమ్మా! నిన్ను చూశాను చాలా ఏళ్ల తర్వాత! నిత్యం స్కూలు మానకుండా వచ్చేదానివి" అన్నారు మాస్టారు.

"అవునండి మాస్టారూ! మీకన్ని విషయాలు గుర్తున్నాయి" అంది వాణి.

"నేను ఎక్కువ సేపు నిలబడలేను వస్తానమ్మా!" అని మాస్టారు వెళ్లిపోయారు.

వాణి అంది ఆనంద్‌తో "చూశారా! ఎప్పుడో ముప్ఫై ఏళ్ల క్రితం అక్కడ చదివాను. ఆయనకి అయినా నేను గుర్తున్నాను."

"వెర్రిమొహమా! నువ్వు గుర్తు లేవాయనకి. గుర్తుంటే నువ్వు చిన్నప్పుడు జీళ్లు తినే దానివని, నీకు 'జీళ్ల పాకం' అని పేరుండేదని చెప్పేవారు కదా!

సాధారణంగా మాస్టార్లందరూ నమస్కారం మాస్టారూ నేను గుర్తున్నానా! అంటే ఆహా నువ్వా! అని, "పెళ్లయిందా, ఎంత మంది పిల్లలూ!" అని ఎవర్నయినా అడగగలిగిన ప్రశ్నలు వేసి సంతోషపెడతారు. అందులో నువ్వు పాద నమస్కారం కూడా పెట్టావు. మా పెద్దమామయ్య లెక్చరర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు చూడు, ఆయన చెప్పాడీ సంగతి పాపం! అయినా మాస్టార్లు కూడా ఎంతమంది శిష్యుల్ని గుర్తు పెట్టుకుంటారు!"

ఆనంద్ చెప్పింది విన్న వాణి ఆనందం క్షణికమయింది.

-భమిడిపాటి సోమయాజి

(హైదరాబాద్)




